# సాక్షి
## అన్నమయ్య జిల్లా

గురువారం । 2 । జనవరి । 2025






**రాతపై పట్టు.. మార్కులు రాబట్టు**

పరీక్ష రాసే విద్యార్థుల చేతి రాత బాగుంటే మూల్యాంకనం చేసే వారికి సులువుగా అర్థమవుతుంది. ఫలితంగా మంచి మార్కులు వేస్తారు.

-8లో



**బొటిక్‌లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్**

వైఎస్సార్ జిల్లా వేంపల్లె పట్టణంలోని ఓ దుకాణంలో జరిగిన అగ్నిప్రమాదం కారణంగా రూ.1.75 కోట్ల విలువగల దుస్తులు, మిషన్లు దగ్ధమయ్యాయి.

-8లో

**మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)**

| | కనిష్టం | గరిష్టం |
|---|---|---|
| మొదటిరకం | రూ.150 | రూ.180 |
| రెండోరకం | రూ.90 | రూ.130 |

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 118 మెట్రిక్ టన్నులు



## న్యూస్‌రీల్

### కళాశాల విద్య ఆర్‌జేడీగా నాగలింగారెడ్డి

**వైవీయూ:** కళాశాల విద్య (డిగ్రీ) కడప ప్రాంతీయ సంయుక్త సంచాలకులుగా డాక్టర్ డి. నాగలింగా రెడ్డి నియమితులయ్యారు. ఆర్‌జేడీగా పనిచేసిన డాక్టర్ డేవిడ్‌కుమార్‌స్వామి డిసెంబర్ 31న ఉద్యోగ విరమణ చేయడంతో ఆయన స్థానంలో నాగలింగారెడ్డిని నియమిస్తూ కళాశాల విద్య డైరెక్టర్ నారాయణ భరత్‌గుప్తా ఉత్తర్వులు జారీచేశారు. దీంతో ఆయన బుధవారం కడప నగరంలోని ఆర్‌జేడీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. కాగా ఈయన అనంతపురం డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఉండగా, పూర్తిస్థాయి అదనపు బాధ్యతలతో కడప ఆర్‌జేడీగా బాధ్యతలు నిర్వహించనున్నారు.

### ఎస్సీ కులగణనపై 7వరకు అభ్యంతరాల స్వీకరణ

**రాయచోటి (జగదాంబసెంటర్):** ఎస్సీ కులగణనపై నిర్వహిస్తున్న అభ్యంతరాల(ఆడిట్ ప్రక్రియ) స్వీకరణ గడువును ఈ నెల 7వ తేదీ వరకు ప్రభుత్వం పొడిగించిందని అన్నమయ్య జిల్లా ఎస్సీ సంక్షేమ, సాధికారక అధికారి ఎస్.జయప్రకాష్ ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ 31వ తేదీతో గడువు ముగియనుండటంతో మరొక వారం రోజులు పొడిగిస్తూ ప్రభుత్వం జీఓ జారీ చేసిందన్నారు. ఈ మేరకు జనవరి 7వ తేదీ వరకు కులగణనపై నిర్దేశిత ప్రాంతాల్లో సంబంధిత అధికారులు ప్రజల నుంచి అభ్యంతరాలు స్వీకరిస్తారన్నారు. అలాగే ఎస్సీల ఉప - వర్గీకరణపై సూచించే నిర్దిష్ట సిఫార్సుల కోసం నియమించిన వన్‌మ్యాన్ కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా ఈ నెల 3వ తేదీన వైఎస్ఆర్ జిల్లా కడపలో పర్యటించనున్నట్లు తెలిపారు. 3న ఉదయం 11 గంటలకు కడపలో పర్యటించే వన్ మ్యాన్ కమిషన్ కార్యక్రమానికి హాజరై సమాచారాన్ని తెలియజేయాలని కోరారు.

### రెండు గ్రామాలకు అందని పింఛన్

**సంబేపల్లె:** ప్రతి నెల ఒకటో తేదీన అందాల్సిన పింఛన్ రెండు గ్రామాలలోని లబ్ధిదారులకు అందక పోవడంతో వారు ఆందోళన చెందుతున్నారు. మండల పరిధిలోని రౌతుకుంట, సంబేపల్లె గ్రామాలకు సంబంధించి దాదాపు 500 మంది పింఛన్ దారులు కొత్త సంవత్సరం మొదట్లోనే పింఛన్ అందకపోవడంతో నిరాశ చెందుతున్నారు. బుధవారం ఉదయాన్నే పింఛన్ వస్తుందని ఎదురు చూసి, ఆయా గ్రామాల సచివాలయాల వద్దకు వెళ్లారు. సాంకేతిక కారణాల వలన పింఛన్ నగదు బ్యాంకు నుంచి రాలేదని సంబంధిత అధికారులు చెప్పడంతో దిగాలు చెందారు. ఉన్నత స్థాయి అధికారులు చొరవ తీసుకొని తమకు పింఛన్ అందేలా చూడాలని వారు కోరుతున్నారు. ఈ విషయమై సంబేపల్లె ఎంపీడీఓ రామచంద్రను వివరణ కోరగా బ్యాంకులో టెక్నికల్ సమస్య ఉందని, వెంటనే బ్యాంకు అధికారులతో సంప్రదించి పింఛన్ అందజేస్తామని వివరణ ఇచ్చారు.

### నేటి నుంచి కేంద్రమంత్రి పర్యటన

**కడప సెవెన్‌రోడ్స్:** కేంద్ర ప్రభుత్వం ఆకాంక్షిత జిల్లాగా గుర్తించిన కడపలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల పురోగతిని సమీక్షించేందుకు కేంద్ర శాస్త్ర సాంకేతికశాఖ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ గురువారం నుంచి మూడు రోజులపాటు జిల్లాలో పర్యటించనున్నారు. బుధవారం రాత్రే ఆయన కడపకు చేరుకున్నారు. 2018లో నాటి ప్రభుత్వం దేశంలో 112 జిల్లాలను ఆకాంక్షిత జిల్లాలుగా గుర్తించింది. అందులో కడప కూడా ఉంది. సామాజిక, ఆర్థిక అభివృద్ధిని వేగవంతం చేయాలన్నది ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యం. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేయడం ద్వారా జిల్లాల మధ్య పోటీ ఏర్పాటు చేసి ర్యాంకింగ్స్ జారీ చేస్తారు. ముఖ్యంగా వైద్యం, పౌష్టికాహారం, విద్య, వ్యవసాయం, జలవనరులు, ఆర్థికం, నైపుణాభివృద్ధి, మౌలిక సదుపాయాలు వంటి అంశాలపై కేంద్రీకరిస్తారు. యాస్పిరేషనల్ బ్లాక్ ప్రోగామ్ కింద జిల్లాలో జమ్మలమడుగు, చింతకొమ్మదిన్నె మండలాలు ఎంపికయ్యాయి. హెల్త్ ఇండికేటర్‌లో భాగంగా గర్భిణుల సమస్యలు, బాలింత తల్లుల పోషకాహార సమస్యలు, విద్యకు సంబంధించిన మౌలిక సదుపాయాలు, సాయిల్ హెల్త్‌కార్డులు జారీ, స్వయం సహాయక బృందాలకు బ్యాంకు రుణాలు వంటి అంశాలపై ఈ మండలాల్లో కేంద్రీకరించి వంద శాతం లక్ష్యాలను సాధించాల్సి ఉంటుంది. నిర్ణీత వ్యవధిలో సంతృప్తికర స్థాయిలో లక్ష్యాలను సాధించాలన్నది సంపూర్ణత అభియాన్ ముఖ్య ఉద్దేశ్యం. కేంద్ర మంత్రి జితేంద్రసింగ్ జిల్లా పర్యటనకు వస్తుండడంతో యంత్రాంగం అందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు ఇప్పటికే పూర్తి చేసింది. నిర్దేశిత రంగాల వారీగా జిల్లాలో సాధించిన ప్రగతిని కేంద్ర మంత్రికి వివరించేందుకు ఆయా శాఖల అధికారులు నివేదికలు సిద్ధంచేశారు.

**నేటి పర్యటన:** కేంద్ర మంత్రి గురువారం చింతకొమ్మదిన్నెమండలం నాగిరెడ్డిపల్లె గ్రామాన్ని సందర్శిస్తారు. అక్కడి విలేజ్ హెల్త్ క్లినిక్, అంగన్వాడీ కేంద్రం, వాటర్ కన్జర్వేషన్‌ప్లాంటు వంటివి పరిశీలిస్తారు.అనంతరం జమ్మలమడుగు మండలం మోరగుడి గ్రామానికి వెళ్లి స్వయం సహాయక సంఘాలతో సమావేశమవుతారు.

# నూతనోత్సాహం

పాత దోస్తుల నయాసాల్ ముచ్చట్లతో..
కొత్త దుస్తుల్లో మెరిసిపోతూ..
కేరింతలు కొట్టే పిల్లల చప్పట్లతో..
తొలిరోజు సంబరంగా సాగింది...

నోరూరించే కేకులతో..
రోజంతా సోకులతో..
తొలిరోజు సరదాగా ముగిసింది...

మందిరాల్లో ప్రార్థనలతో..
మండపాల్లో ప్రత్యేక పూజలతో...
దైవ దర్శనాలతో..
ఆద్యంతం ఆధ్యాత్మికంగా గడిచింది..

అన్నదానాలతో.. ఆత్మీయ సన్మానాలతో...
అభాగ్యులకు ప్రేమతో పంచిన ఫలహారాలతో
సామాజిక సేవ వెల్లివిరిసింది..

కిస్సిక్కు పాటలతో.. కిర్రాక్కు స్టెప్పులతో..
ఉత్సాహం ఉరకలెత్తింది..

నూతన సంవత్సరానికి జిల్లా ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. అందరికీ మంచి జరగాలని ఆకాంక్షించారు.

- రూ. కోటి కేకులు హాం ఫట్
- రెస్టారెంట్లకు మంచి వ్యాపారం
- పూలు, స్వీట్లకు కూడా మంచి డిమాండ్
- నగరంలో నూతన సంవత్సర సందడి

**సాక్షి, రాయచోటి:** నూతన సంవత్సరానికి జిల్లా వాసులు ఘనంగా స్వాగతం పలికారు. విందులు, వినోదాలతో ఆనందంగా గడిపారు. జిల్లా అంతటా రూ. కోటి మేర కేకుల వ్యాపారం జరిగిందని, అదే స్థాయిలో రెస్టారెంట్లలోనూ వ్యాపారం జరిగిందని సమాచారం. పూలు, స్వీట్లకు కూడా మంచి డిమాండ్ ఏర్పడింది. స్వచ్ఛంద సంస్థలు తమ సభ్యులతో కలిసి కేక్ కట్‌చేసి కొత్త ఆశయాలతో, ఆదర్శంగా ముందుకు సాగాలని నిర్ణయం తీసుకున్నారు.

- నూతన సంవత్సర వేడుకల్లో ప్రధానంగా కేకులకే ప్రథమ స్థానం దక్కింది. కార్పొరేట్ స్టైల్ కేకుల దుకాణాల్లో రూ. 2.50 లక్షల నుంచి 5 లక్షల మేర వ్యాపారం జరిగినట్లు సమాచారం. చిన్న దుకాణాలలో కూడా రూ. 50 వేల నుంచి లక్షన్నరకు పైగా వ్యాపారం జరిగిందని తెలుస్తోంది. కేకుల తర్వాత ప్రధానంగా యువత డిసెంబరు 31 రాత్రి రెస్టారెంట్లలో గడిపేందుకు ప్రాధాన్యత ఇచ్చారు. ఈసారి మధ్యతరగతి, ఎగువ మధ్యతరగతి ప్రజలు కూడా రెస్టారెంట్ల నుంచి ఆహారం తెప్పించుకునేందుకే మొగ్గు చూపారు. ఆన్‌లైన్ ద్వారా ఆహారం తెప్పించుకునే సౌకర్యం ఉండడం, రెండు రోజుల ముందునుంచి ఆఫర్ల గురించిన సమాచారం ప్రజలకు అందడంతో ఈ ఏడాది వ్యాపారం గణనీయంగా పెరిగింది.
- ఇవి కాకుండా పూలు, పుష్పగుచ్ఛాల వ్యాపారం ఓ మోస్తరుగానే జరిగినట్లు సమాచారం. మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మరణంతో సంతాప దినాలు పాటిస్తుండడంతో అధికారులు, ప్రజాప్రతినిధులు పూల మాలలు, బొకేలు, పండ్లు స్వీకరించేందుకు దూరంగా ఉంటామని ముందే ప్రకటించారు. దీంతో పూల వ్యాపారం ఆశించిన మేర లేకపోవడంతో వ్యాపారాలు మందగించినట్లు వారు పేర్కొన్నారు. స్వీట్ల వ్యాపారం కూడా జోరుగా సాగింది. ఆఫర్లతోపాటు పలు రకాల స్వీట్లను అందుబాటులోకి తెచ్చి ప్రత్యేకంగా పందిళ్లు వేసి ఆకర్షణీయంగా దుకాణాలను ఏర్పాటు చేయడంతో వీటి వ్యాపారం బాగానే సాగింది. మొత్తంపై జిల్లా అంతటా రూ. కోటి కేకుల వ్యాపారం, రెస్టారెంట్లలో రూ. కోటి మేరకు ఆహార పదార్థాల వ్యాపారం, రూ. 10 లక్షల మేరకు పూలు, అదేస్థాయిలో పండ్లు, స్వీట్ల వ్యాపారం జరిగినట్లు ఆయా వ్యాపార వర్గాల ద్వారా సమాచారం అందింది.



ఒంటిమిట్ట కోదండరామాలయంలో బాలాలయం వద్ద స్వామివారి దర్శనానికి బారులు తీరిన భక్తులు



రామయ్య గాలిగోపురం వద్ద భక్తుల సందడి



హార్సిలీహిల్స్‌లోని గాలిబండపై పర్యాటకుల సందడి

### ఒంటిమిట్ట రామాలయానికి పోటెత్తిన భక్తులు

**ఒంటిమిట్ట:** ఆంధ్రా భద్రాద్రిగా పేరు గాంచిన ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి దేవాలయానికి నూతన సంవత్సరం సందర్భంగా వేల సంఖ్యలో భక్తులు పోటెత్తారు. భక్తుల కోసం తిరుమల-తిరుపతి దేవస్థానం వారు బాలాలయం వద్ద ప్రత్యేక క్యూలైన్లను ఏర్పాటు చేశారు. రామాలయం లోపల ప్రాంగణం అంతా భక్తులతో కిటకిటలాడింది. తిరుమల-తిరుపతి దేవస్థానం వారు భక్తుల కోసం రుచికరమైన నైవేద్య ప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఈ ప్రసాదం కోసం భక్తులు పొడవాటి క్యూలైన్‌లో బారులు తీరారు. అలాగే రామాలయం ఎదురుగా ఉన్న అన్న ప్రసాద కేంద్రానికి భక్తులు పోటెత్తారు.

**దేవునికడపలో..**

తిరుమలేశుని తొలి గడప దేవునికడపలో నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని బుధవారం దైవ దర్శనం కోసం వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం సందడిగా కనిపించింది. ఆలయ నిర్వాహకులు భక్తుల రద్దీని నియంత్రించేందుకు బారికేడ్లు ఏర్పాటు చేశారు. అందరికీ తిరుమలేశుని లడ్డూ ప్రసాదం అందుబాటులో ఉంచారు.

**చర్చిలు, దర్గాలలో..**

జిల్లాలోని మదనపల్లె, రైల్వేకోడూరు, రాజంపేట, రాయచోటి, తంబళ్లపల్లె, పీలేరు తదితర ప్రాంతాల్లో అర్ధరాత్రి నుంచి చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అలాగే పలు దర్గాలలో కూడా ప్రజలు పెద్ద సంఖ్యలో ప్రార్థనలు జరిపారు.



దేవునికడపలో స్వామివారి గ్రామోత్సవం

# కొత్త ఏడాది కిక్కే.. కిక్కు!

- భారీగా మద్యం విక్రయాలు
- అన్నమయ్య జిల్లాలో రూ. 10 కోట్ల మద్యం తాగేశారు
- మద్యం కల్తీతో మత్తు ఎక్కలేదంటున్న మందు బాబులు



**రాయచోటి:** నూతన సంవత్సర సంబరాల పేరుతో అన్నమయ్య జిల్లాలో 10 కోట్ల రూపాయల మద్యం విక్రయాలు జరిగాయి. జిల్లా వ్యాప్తంగా 117 మద్యం షాపుల్లో మూడు రోజుల్లోనే ఈ మద్యం విక్రయాలు జరిగినట్లు జిల్లా ఎక్సైజ్ ప్రొహిబిషన్ అధికారి మధుసూదన్ రావు తెలిపారు. సోమవారం నుంచి బుధవారం సాయంత్రం వరకు పది కోట్ల రూపాయల మద్యాన్ని షాపుల ద్వారా భారీగా విక్రయించారు. ఇందులో 12352 లిక్కర్ కేసులు, 6838 బీరు కేసులు అమ్ముడు పోయాయి. సోమవారం రూ. 3.17 కోట్లు, మంగళవారం రూ. 5.83 కోట్లు, బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు కోటి రూపాయలు విలువజేసే మద్యాన్ని మందుబాబులు సేవించారు. రాష్ట్రంలో చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మద్యం పాలసీలు సవరించింది. గతంలో ఉన్న పాలసీలో మార్పులు చేస్తూ ప్రైవేటు నిర్వహణకు మద్యం షాపులను అప్పగించింది. జిల్లా వ్యాప్తంగా ప్రైవేటు నిర్వహణలోని మద్యం షాపుల్లో అమ్మకాలు గణనీయంగా పెరిగినట్లు అధికారులు చెబుతున్నారు.

### కిక్కు ఎక్కని మందు..



రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేటు షాపుల ద్వారా నాణ్యమైన మద్యం అందిస్తున్నామని చెబుతున్నా తాగిన మందుతో కిక్కు ఎక్కలేదని పలువురు మద్యం ప్రియులు అంటున్నారు. ప్రైవేటు షాపుల నిర్వాహకులు షాపులలో మద్యాన్ని కల్తీ చేసి మందుబాబులకు విక్రయించారన్న ఆరోపణలు ఉన్నాయి. మద్యం విక్రయాలలో 20 శాతం ఆదాయం వచ్చేలా చూస్తామని చెప్పి 9 శాతానికి మించకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టడంతో ప్రైవేటు నిర్వాహకులు కల్తీ మద్యం విక్రయాలకు సిద్ధమైనట్లు మందుబాబులనోట వినిపిస్తోంది.

# సదరం క్యాంపులకు సడన్ బ్రేక్!

- దివ్యాంగులకు ఇచ్చే పింఛన్లపై కూటమి కుట్ర
- సచివాలయాల చుట్టూ తిరుగుతున్న దివ్యాంగులు



సదరం క్యాంపులో పరీక్షిస్తున్న ఆర్థో వైద్యుడు (ఫైల్‌ఫొటో)

**జిల్లాలో సదరం సర్టిఫికెట్లు జారీ చేసే ఆస్పత్రులు**

| | |
|---|---|
| మదనపల్లె | జిల్లా ఆస్పత్రి |
| రాయచోటి | సీహెచ్‌సీ |
| పీలేరు | సీహెచ్‌సీ |
| రాజంపేట | సీహె చ్‌సీ |
| పీలేరు | సీహెచ్‌సీ |
| తంబళ్లపల్లె | సీహె చ్‌సీ |



**మదనపల్లె సిటీ:** దివ్యాంగులపై కుట్రకు కూటమి ప్రభుత్వం సిద్ధమవుతోంది. వారికి అందించే పింఛన్‌లో భారీగా కోత విధించాలని ఆలోచిస్తోంది. ఒకవైపు ఉన్న వారిని తగ్గించడంతో పాటు తనిఖీల పేరుతో కొత్త లబ్ధిదారులకు పింఛన్ పొందే అవకాశం లేకుండా చేస్తోంది. ఇందులో భాగంగా జనవరి ఒకటో తేదీ నుంచి సదరం సర్టిఫికెట్ల జారీకి బ్రేక్ వేసింది. దీంతో ఈ ప్రక్రియ నిలిచిపోనుంది. దీని వల్ల దివ్యాంగ పింఛన్ కోసం కొత్తగా ఎవరూ దరఖాస్తు చేసుకోలేని పరిస్థితి.

**సదరం కీలకం**

దివ్యాంగ పింఛన్‌కు సదరం సర్టిఫికెట్ ఎంతో కీలకం కానుంది. ఇది లేకుండా పింఛన్ పొందే అవకాశం లేదు. ఆర్థోపెడిక్, అంధత్వం, వినికిడి, మానసిక రుగ్మతలు, శారీరక వైకల్యం, మానసిక, శారీరక లోపాలు, దృష్టి లోపంతో బాధపడే వారి వైకల్యాన్ని నిర్ధారిస్తూ సదరం సర్టిఫికెట్లు జారీ చేస్తారు. ఈ సర్టిఫికెట్ ఉంటేనే దివ్యాంగులకు పింఛను, ఉద్యోగాల భర్తీ, బస్‌పాస్, ఇతర సదుపాయాలు వర్తిస్తాయి. ఈ సర్టిఫికెట్ లేకపోతే దివ్యాంగులుగా గుర్తించే అవకాశం లేదు. తాజాగా పింఛన్ల భారాన్ని తగ్గించుకోవడానికి కూటమి ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో దివ్యాంగులు మిగిలిన రాయితీలు, సౌకర్యాలు పొందలేని పరిస్థితి నెలకొంది. దీంతో దివ్యాంగుల్లో కలవరం మొదలైంది.

**వారంలో 150 మందికిపైగా దరఖాస్తు**

జిల్లాలో రాయచోటి, మదనపల్లె, రాజంపేట, తంబళ్లపల్లె, పీలేరు ప్రభుత్వ ఆస్పత్రుల్లో సదరం సర్టిఫికెట్లు జారీ చేస్తున్నారు. వారంలో సుమారు 150కిపైగా సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసుకుంటున్నారు. వైద్య పరీక్షలు పూర్తయిన 15 రోజుల్లో సర్టిఫికెట్లు ఆన్‌లైన్ ద్వారా జారీ అయ్యేవి.

**3 నుంచి తనిఖీలు**

ఈనెల 3వతేదీ నుంచి సదరం సర్టిఫికెట్ ద్వారా పింఛన్లు పొందుతున్న వివరాలపై సర్వే చేయనున్నారు. సదరం సర్టిఫికెట్ ద్వారా మంచానికి పరిమితమైన పలువురికి, 80 శాతం నుంచి వంద శాతం వైకల్యం ఉన్న వారికి నెలకు రూ.15 వేలు పింఛను అందజేస్తున్నారు. దివ్యాంగుల్లో కేటగిరిని బట్టి రూ.5 వేలు, రూ.10వేలు, రూ.15వేలు చొప్పున ఇస్తున్నారు. కిడ్నీ డయాలసిస్ రోగులకు రూ.15 వేలు పింఛను అందజేస్తున్నారు.

**సచివాలయాల చుట్టూ తిరుగుతున్న దివ్యాంగులు**

సదరం సర్టిఫికెట్ల స్లాట్ బుకింగ్ కోసం దివ్యాంగులు రోజూ ఆయా పరిధిలోని సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. సైట్ నిలిపివేశారని, ఓపెన్ అయితే చెబుతామని సచివాలయ సిబ్బంది చెబుతున్నారు.

# క్యూ లైన్‌కి బై.. క్యూఆర్ కోడ్‌కి జై!

- బిల్లులు చెల్లించడానికి క్యూలైన్లలో నిల్చోవాల్సిన పనిలేదు
- ఈ నెల బిల్లుతోపాటే క్యూఆర్ కోడ్
- ఫోన్‌పే, పేటీఎం, జీ పే ద్వారా స్కాన్‌చేసి చెల్లించేందుకు అవకాశం
- కడప డివిజన్‌లో ప్రయోగాత్మకంగా అమలు

**కడప కార్పొరేషన్:** విద్యుత్ వినియోగదారులకు కరెంటు బిల్లులు చెల్లించడం చాలా సులువు కానుంది. కరెంటు బిల్లులు చెల్లించేందుకు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల మధ్య క్యూ లైన్లలో నిలబడి, మన సమయాన్నంతా వృథా చేసుకోవాల్సిన పనిలేదు. ఎందుకంటే ఆంధ్రప్రదేశ్ సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్(ఏపీఎస్‌పీడీసీఎల్) నూతన విధానాన్ని అమల్లోకి తెచ్చింది. బిల్లుతోపాటు క్యూఆర్ కోడ్ ముద్రించి వినియోగదారులకు ఇవ్వనున్నారు. వినియోగదారులు తమ యూపీఐ యాప్‌లైన ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం ద్వారా విద్యుత్ బిల్లులను అతి సులువుగా చెల్లించేందుకు అవకాశం కల్పించారు. కడప డివిజన్‌లో జనవరి మాసం నుంచి దీన్ని ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నారు. ఇక్కడ ఈ ప్రక్రియ విజయవంతమైతే జిల్లావ్యాప్తంగా అమలు చేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.



క్యూఆర్ కోడ్‌తోపాటు వచ్చిన కరెంటు బిల్లులు

- గతంలో ఫోన్‌పే, గూగుల్ పే, పే టీఎం ద్వారా కరెంటు బిల్లులు చెల్లించేవారు. కొన్ని సాంకేతిక కారణాలతో ఆ యాప్‌లలోంచి ఏపీఎస్పీడీసీఎల్‌ను తొలగించారు. ఫలితంగా వినియోగదారులు మళ్లీ విద్యుత్ బిల్లుల చెల్లింపు కేంద్రాలకు క్యూ కట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. తాజాగా ఏపీఎస్‌పీడీసీఎల్ అధికారులు ప్రతి కరెంటు బిల్లుకు క్యూఆర్ కోడ్ కేటాయించి దాని ద్వారా ఎవరి ఇంటికి వచ్చిన కరెంటు బిల్లును వారే చెల్లించుకునేలా ఏర్పాట్లు చేశారు. చాలా ప్రైవేటు సంస్థల్లో ఈ క్యూఆర్ కోడ్ ద్వారా నగదు చెల్లించే ప్రక్రియ అమలవుతుండగా, ప్రభుత్వ రంగ సంస్థ అయిన ఏపీఎస్‌పీడీసీఎల్‌లో ఈ విధానాన్ని తొలిసారి తీసుకువచ్చారు. ఇందులోని లోటుపాట్లు అన్నీ సరిచేశాక జిల్లా వ్యాప్తంగా అమలు చేయనున్నారు.
- ఏపీఎస్‌పీడీసీఎల్ ఆపరేషన్ సర్కిల్‌లో కడప డివిజన్‌లో కడప, చెన్నూరు, వల్లూరు, సీకేదిన్నె, పెండ్లిమర్రి, ఒంటిమిట్ట, సిద్దవటం మండలాలు ఉన్నాయి. ఇందులో 36 సబ్‌స్టేషన్లు ఉన్నాయి. కడప డివిజన్‌లో మొత్తం 1.90లక్షల కనెక్షన్లు ఉండగా, 1.69లక్షల మంది గృహ వినియోగదారులు, 23,793 వాణిజ్య పరమైన కనెక్షన్లు ఉన్నాయి. జనవరి మాసం నుంచి వీరందరికీ కరెంటు బిల్లుతోపాటు క్యూఆర్ కోడ్ ప్రింట్ చేసి ఇవ్వనున్నారు. దాన్ని స్కాన్ చేసి ఎవరికి వారు కరెంటు బిల్లును సులువుగా చెల్లించవచ్చు.

### క్యూఆర్ కోడ్‌తో కరెంటు బిల్లులు చెల్లించండి

- ఈఈ గంగాధరం

**మదనపల్లె:** ఏపీఎస్పీడీసీఎల్ విద్యుత్ వినియోగదారులు జనవరి నెలకు సంబంధించిన విద్యుత్‌బిల్లులను, బిల్లులో ముద్రించిన క్యూఆర్ కోడ్ ఆధారంగా చెల్లించవచ్చునని ఈఈ గంగాధరం అన్నారు. బుధవారం మీడియాకు విడుదల చేసిన పత్రికా ప్రకటనలో... జనవరిలో విద్యుత్ మీటర్ల రీడింగ్‌కు సంబంధించి జారీ చేసే బిల్లుల్లో నూతనంగా క్యూఆర్ కోడ్ ముద్రించడం జరుగుతోందన్నారు. వినియోగదారులు తమ మొబైల్‌ఫోన్లలో క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా సులభంగా విద్యుత్ బిల్లులను చెల్లించవచ్చన్నారు. వినియోగదారులు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### అయ్యప్ప భక్తులకు ప్రత్యేక రైళ్లు

**కడప కోటిరెడ్డిసర్కిల్:** ప్రతి ఏడాది శబరిమలకు వెళ్లే అయ్యప్ప భక్తుల సంఖ్య ఉమ్మడి జిల్లాలో పెరుగుతూ వస్తోంది. వీరికోసం రైల్వేశాఖ అధికారులు ప్రత్యేక రైళ్లను నడపాలని నిర్ణయించారు. ఈ మేరకు ఈ నెలలో కడప మీదుగా ఆరు ప్రత్యేక రైళ్లను నడపనున్నారు.

**ప్రత్యేక రైళ్లు**

అయ్యప్పభక్తులతోపాటు ఇతర ప్రయాణికుల కోసం 07151 నెంబరుగల కాచిగూడ నుంచి రైలు కొట్టాయంకు జనవరి 2, 9, 16, 23 తేదీల్లో ప్రయాణిస్తుంది.

- 07152నెంబరుగల రైలు కొట్టాయం నుంచి కాచిగూడకు జనవరి 3, 10, 17, 24 తేదీల్లో బయలుదేరుతుంది.
- 07065 నెంబరుగల రైలు హైదరాబాదు నుంచి కొట్టాయంకు జనవరి 7, 14, 21, 28 తేదీల్లో నడుస్తుంది.
- 07066 నెంబరుగల రైలు కొట్టాయం నుంచి సికింద్రాబాద్‌కు జనవరి 8, 15, 22, 29 తేదీల్లో , 07183 నెంబరుగల రైలు నర్సాపురం నుంచి కొల్లాంకు జనవరి 15, 22 తేదీలలో బయలుదేరుతుంది.
- 07184 నెంబరుగల రైలు కొల్లాం నుంచి నర్సాపురానికి జనవరి 17, 24 తేదీలలో ప్రయాణిస్తుంది.

**టిక్కెట్ల వివరాలు**

కడప నుంచి కొట్టాయంకు జనరల్ టిక్కెట్ రూ. 265, స్లీపర్ రూ. 565, త్రీ టైర్‌ఏసీలో రూ. 1595, టు టైర్ ఏసీలో 2010గా నిర్ణయించారు. కడప నుంచి కొల్లాంకు జనరల్ రూ. 285, స్లీపర్ రూ. 595, త్రీ టైర్‌లో రూ.1680, టు టైర్‌లో రూ. 2240గా నిర్ణయించారు.

## క్లుప్తంగా

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

మదనపల్లె : రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి గాయపడి మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మదనపల్లె మండలం కోటవారిపల్లె పంచాయతీ బండకాడపల్లెకు చెందిన రైతు రమణ(50) వ్యక్తిగత పనులపై ద్విచక్ర వాహనంలో కలికిరికి వెళ్లాడు. తిరిగి మదనపల్లెకు వస్తుండగా.. వాల్మీకిపురం విఠలం వద్ద మదనపల్లె నుంచి తిరుపతి వెళుతున్న బస్సు ఢీకొంది. ప్రమాదంలో రమణ తీవ్రంగా గాయపడగా, గమనించిన స్థానికులు బాధితుడిని మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. సంబంధిత పోలీసులు కేసులు విచారణ చేస్తున్నారు.

### బైక్ అదుపుతప్పి యువకుడికి...


ఖాదర్‌బాషాకు సపర్యలు

బి.కొత్తకోట : బి.కొత్తకోట నుంచి మదనపల్లె వైపునకు బైక్‌పై వెళ్తున్న యువకుడు అదుపుతప్పి కిందపడడంతో తీవ్రగాయాలయ్యాయి. బి.కొత్తకోటకు చెందిన ఖాదర్ బాషా(25) బైక్‌పై వెళ్తూ మొగసాలమర్రి సిరికల్చర్ ఫాం వద్దకు రాగానే అదుపుతప్పి కిందపడ్డాడు. తల, చేతులు, కాళ్లకు గాయాలయ్యాయి. ఈ ఘటన సమయంలో వెళ్తున్న సీహెచ్‌సీ సిబ్బంది వెంకటరమణ, వైఎస్సార్‌సీపీ నాయకులు సూరపువారిపల్లె రాజశేఖర్‌రెడ్డి గాయాలను శుభ్రం చేసి చేతికి కట్టు కట్టారు. రోడ్డు పక్కన కూర్చోబెట్టి సపర్యలు చేసి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. తర్వాత బాధితుడిని ఆస్పత్రికి తరలించారు.

### ఆటో ఢీ కొని విద్యార్థినికి..


ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన నవ్య


ములకలచెరువు : స్కూటీలో వెళుతున్న విద్యార్థినిని ఆటో ఢీకొనడంతో తీవ్రగాయాలైన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం మేరకు... మండలంలోని దుగసానిపల్లెకు చెందిన పి.నవ్య(17) తన స్కూటీలో సొంపాళ్యంలోని చెన్న కేశవస్వామి ఆలయంలో స్వామిని దర్శించుకొని తిరిగి ఇంటికి వెళ్తున్నారు. మార్గ మధ్యంలో రెడ్డివారిపల్లె వద్ద ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొనడంతో నవ్యకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనం ద్వారా మదనపల్లె ప్రభుత్వ హాస్పిటల్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. సంఘటన స్థలాన్ని ఎస్ఐ నరసింహుడు పరిశీలించి కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

### కోడిపందేల జోరు

గుర్రంకొండ : కోడి పందేలు నిర్వహిస్తున్నారనే సమాచారంతో పోలీసులు ఆస్థావరాలపై దాడులు జరిపి 11 మంది జూదరులను అరెస్ట్ చేశారు . పోలీసుల వివరాల మేరకు.. మండలంలోని శెట్టివారిపల్లె పంచాయతీ బోడిగుట్ట సమీపంలోని దొర చెరువు వద్ద కోడి పందేలు జరుగుతున్నాయనే సమాచారం అందుకున్న పోలీసులు దాడులు నిర్వహించారు. 11 మంది జూదరులను అరెస్టు చేసి వారి నుంచి రూ.20,610 స్వాధీనం చేసుకొన్నట్లు ఎస్ఐ మధురామచంద్రుడు తెలిపారు. మూడు పందెం కోళ్లు, ఐదు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకొని, జూదరులపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

# రాతపై పట్టు.. మార్కులు రాబట్టు


టెన్త్, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు టైమ్ టేబుల్ కూడా వచ్చేసింది. అత్యుత్తమ మార్కులు సాధించి మంచి ర్యాంకుతో ఉత్తీర్ణత సాధించాలనే లక్ష్యంతో విద్యార్థులు ఓ ప్రణాళిక అప్పుడే రూపొందించుకొని చదవడం ప్రారంభించారు. అయితే ఏడాది పాటు చదివిన విషయాలను జవాబు పత్రంపై రాసే విధానంతోనే మార్కులు, ర్యాంకులు ఆధారపడి ఉంటాయి. దీనిపై ప్రత్యేక దృష్టి సారించే విద్యార్థులు తక్కువమంది మాత్రమే ఉంటారు. విద్యార్థులు పరీక్షల్లో ప్రశ్నలకు సమాధానాలు రాయడం ఎంత ముఖ్యమో.. చేతిరాత అంతే ముఖ్యమన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని చేతిరాత నిపుణులు సూచిస్తున్నారు.



గుండ్రటి అక్షరాలు రాస్తూ.....

- పరీక్షల్లో చేతిరాత కూడా ముఖ్యం
- టెన్త్, ఇంటర్ విద్యార్థులకు నేర్చేందుకు ఇది సరైన సమయం
- దస్తూరిపై సాధన చేయాలంటున్న నిపుణులు

రాజంపేట టౌన్ : పరీక్ష రాసే విద్యార్థుల చేతి రాత బాగుంటే మూల్యాంకనం చేసే వారికి సులువుగా అర్థమవుతుంది. ఫలితంగా మంచి మార్కులు వేస్తారు. చేతి రాత బాగాలేకపోతే మూల్యాంకనం చేసే వారికి సమాధానం అర్థం కాకుంటే ఒక మార్కు లేదా అర్ధ మార్కు తగ్గే అవకాశం ఉంటుంది. ఇది టోటల్ మార్కులపై ప్రభావం చూపి ర్యాంకు తగ్గే అవకాశం లేకపోలేదు. విద్యార్థులు.. చేతిరాతపై ప్రత్యేక దృష్టిసారించాల్సిన అవసరం ఎంతైనా వుంది. పరీక్షలకు రెండు నెలలకు పైగా సమయం ఉన్నందున విద్యార్థులు ప్రతి రోజూ అరగంట చేతిరాతపై సాధన చేయాలని నిపుణులు సూచిస్తున్నారు. పరీక్షల్లో చేతిరాత ఎలాఉండాలో నిపుణుల మాటల్లోనే...



- విద్యార్థుల ఆన్సర్ షీట్ (బుక్‌లెట్)లో సమాధానాలను స్పష్టంగా రాయాలి.
- నాలుగు వైపులా మార్జిన్లు (బార్డర్లు) వేసుకుంటే అందంగా ఉంటుంది.
- బుక్‌లెట్‌లో ఎడమవైపు రెండున్నర సెంటీమీటరు, కుడివైపు, పైనా, కింద ఒకటిన్నర సెంటీమీటరు బార్డర్ వేసుకోవాలి
- ఒక లైన్, మరో లైనుకు ఒకటిన్నర సెంటీమీటరు గ్యాప్ ఇవ్వాలి.
- పదానికి, పదానికి అర్ధ సెంటీ మీటరు స్పేస్ ఇవ్వాలి.
- బుక్‌లెట్‌లో వాక్యాలు పైకి కిందకు లేకుండా వరుస క్రమంలో ఉండాలి.
- బొటన వేలు, మూడవ వేలికి మధ్య చూపుడు వేలు సాయంతో పెన్నును చక్కగా పట్టుకోవాలి. ఇలా చేయడం వల్ల రాసే సమయంలో స్పీడుగా ముందుకు కదులుతుంది.
- ముఖ్యంగా పరీక్షల సమయంలో విద్యార్థులు తగినంత విశ్రాంతి తీసుకోవాలి. లేకుంటే ఆ ప్రభావం చేతిరాతపై కూడా పడుతుంది.
- మనసు ప్రశాంతంగా ఉంటే చేతిరాత చక్కగా వస్తుంది. సమాధాన పత్రంలో అక్షరాలు బాగుంటే ప్రతి సబ్జెక్టులో కనీసం నాలుగు నుంచి ఐదు మార్కులు పెరిగే అవకాశం ఉంది.
- అక్షరాలు బాగాలేకపోతే చాలా అన్ని సబ్జెక్టులపై చాలా మార్కులు కోల్పోవాల్సి వస్తుంది.

### సాధనతోనే చక్కటి చేతిరాత సాధ్యం



చక్కటి చేతి రాత సాధనతోనే సాధ్యం కాగలదు. పరీక్షలకు ఇంకా సమయం ఉన్నందున విద్యార్థులు అక్షరాలను గుండ్రంగా రాసేందుకు సమయం కేటాయించి సాధన చేయాలి. చాలామంది తొలి ప్రశ్నకు గుండ్రటి అక్షరాలతో సమాధానం రాస్తారు, ఆ తరువాత సమయం అయిపోతుందనే ఆందోళనతో వేగంగా రాయడం ప్రారంభిస్తారు. గుండ్రటి అక్షరాలు కుదరవు. ఈ ప్రభావం మార్కులపై పడుతుంది. అన్ని ప్రశ్నలకు సమాధానాలు గుండ్రంగా రాయాలంటే సాధన తప్పనిసరి.

– నటవ నరసింహులు, చేతిరాత నిపుణులు, ప్రభుత్వ ఉపాధ్యాయుడు, రాజంపేట

# ఉపాధ్యాయులకు డీఈఓ వేధింపులు


సమావేశంలో మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా

**యూటీఎఫ్ జిల్లా శాఖ ఆరోపణ**

కడప ఎడ్యుకేషన్ : పాఠశాలల తనిఖీ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులపై డీఈఓ మీనాక్షి వ్యవహరిస్తున్న తీరు సరికాదని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీరాజా, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్‌బాబు ఆరోపించారు. కడప యూటీఎఫ్ భవన్‌లో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ డీఈఓగా మీనాక్షి బాధ్యతలు చేపట్టిన నాటి నుంచే వివాదాస్పదంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. పాఠశాలల తనిఖీకి వెళ్లిన సందర్భంలో హెచ్ఎం, టీచర్స్‌పై వేధింపులకు పాల్పడుతున్నారన్నారు. టీచర్స్ డిజిటల్ లెసన్ ప్లాన్స్ వాడటానికి ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ అనుమతినిస్తూ ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ, ఉన్నతాధికారుల ఆదేశాలను లెక్కచేయకుండా చేతిరాతతో రాసిన లెసన్ ప్లాన్లను వాడాలంటూ ఆదేశాలివ్వడం సరికాదన్నారు. విద్యార్థుల ఎదుటే టీచర్స్‌ను తిడుతూ అవమానిస్తున్నారన్నారు. విద్యార్థులకు సరఫరా చేసిన బూట్లు పాడవడంతో కొందరు విద్యార్థులు ధరించలేదని, అందుకు హెచ్ఎం, పీఈటీలను బాధ్యులను చేస్తూ దూషించడం దారుణమని ఆరోపించారు. ఉపాధ్యాయ సంఘాల సమస్యలపై ప్రాతినిధ్యం చేయడానికి వెళ్లినప్పుడు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. విజ్ఞాన యాత్రలకు విద్యార్థులను తీసుకెళ్లడానికి డీఈఓ అనుమతి కోరితే వెళ్లడానికి వీలు లేదంటూ హుకుం జారీ చేయడం, కలెక్టర్ దగ్గరికే వెళ్లి పర్మిషన్ తెచ్చుకోండంటూ హెచ్ఎంలను ఇబ్బందులకు గురి చేయడం చేస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అపార్ వంద శాతం పూర్తి చేయలేదనే కారణంగా జిల్లాలోని 829 మంది ఉపాధ్యాయులకు షోకాజు నోటీసులు జారీ చేసిన ఘనత డీఈఓకే దక్కుతుందన్నారు. ఆమె వైఖరిపై రాష్ట్ర అధికారులకు ఫిర్యాదు చేస్తున్నామని, ప్రభుత్వం స్పందించి చర్యలు తీసుకోకపోతే ప్రత్యక్ష కార్యాచరణకు దిగుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా గౌరవాధ్యక్షుడు నాగార్జునరెడ్డి, ట్రెజరర్ నరసింహారావు, జిల్లా కార్యదర్శులు సి.వి.రమణ, చెరుకూరి శ్రీనివాసులు, మురళీకృష్ణ, రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు రూతు ఆరోగ్య మేరీ తదితరులు పాల్గొన్నారు.

# బొటిక్‌లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్

**రూ.1.75 కోట్ల విలువ చేసే దుస్తులు, మిషన్లు దగ్ధం**


విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో కాలిన దుస్తులు, కుట్టు మిషన్లు

వేంపల్లె : భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకోవడంతో కోట్ల రూపాయల నష్టం వాటిల్లింది. దుకాణంలో ఉన్న రూ.1.75 కోట్ల విలువగల దుస్తులు, మిషన్లు దగ్ధమయ్యాయి. బాధితులు సుష్మా, ప్రసాద్ రెడ్డిల కథనం మేరకు..వేంపల్లె పట్టణంలోని రెడ్డి నగర్ వీధిలోని తమ నివాసంలో సుష్మా, ప్రసాద్‌రెడ్డి సుమంగళి బొటిక్ దుకాణం ఏర్పాటుచేశారు. నూతన సంవత్సరం కావడంతో కుటుంబ సభ్యులతో కలిసి వారు పాపాఘ్ని నది సమీపంలోని ఎద్దుల కొండపై జరిగే వేంకటేశ్వరస్వామి కళ్యాణానికి వెళ్లారు. దుకాణంలో పనిచేస్తున్న సిబ్బంది దుకాణానికి తాళం వేసి భోజనం చేయడానికి వెళ్లారు. ప్రమావశాత్తూ విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దుకాణంలోని దుస్తులకు మంటలు వ్యాపించాయి. కిటికీల్లో నుంచి పొగ రావడంతో స్థానికులు దుకాణ యజమానులకు సమాచారం అందజేశారు. సుమంగళి బొటిక్ యాజమాని సుష్మా హుటాహుటిన వచ్చి అగ్నిమాపక సిబ్బందికి సమాచారమిచ్చారు. హుటా హుటిన అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. అప్పటికే దుకాణంలో దుస్తులు, కుట్టు మిషన్లు పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావడంతో దుకాణంలో ఉన్న దుస్తులు, కుట్టు మిషన్లు దగ్ధం కావడంతో సుమారు రూ.1.75 కోట్ల నష్టం వాటిల్లిందని బాధితులు సుష్మా, ప్రసాద్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు ఆర్పి వేశారు. డ్రస్సు కుట్టించు కొనేందుకు ప్రజలు ఇచ్చిన దుస్తులు కూడా దగ్ధమైనట్లు చెప్పారు. దుకాణంలో ఎవరూ లేకపోవడంతో ప్రాణ నష్టం జరగలేదని తెలిపారు. ప్రభుత్వం స్పందించి నష్టపరిహారం అందించి ఆదుకోవాలని బాధితులు కోరారు.

# శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేయండి


మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్పీ విద్యాసాగర్ నాయుడు

రాయచోటి టౌన్ : అన్నమయ్య జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేయాలని రాష్ట్ర రవాణా, క్రీడలు, యువజన శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఎస్పీకి సూచించారు. నూతన సంవత్సరం సందర్భంగా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు మంత్రి కార్యాలయంలో మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అంతకు ముందు మంత్రితోపాటు, ఆయన భార్య హరితమ్మ, కుమారుడు నిశ్చల్‌నాగిరెడ్డి, సోదరుడు లక్ష్మీప్రసాద్‌రెడ్డికి పార్టీ కార్యకర్తలు, అభిమానులు, అధికారులు పూలబొకె అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

### అల్లుడు దాడి చేశాడని ఫిర్యాదు

నిమ్మనపల్లె : కుటుంబం గురించి పట్టించుకోలేదని నిలదీస్తే అల్లుడు తనపై దాడి చేశాడని అత్త నిమ్మనపల్లె పోలీసులకు ఫిర్యాదు చేసింది. మండలంలోని రాచవేటివారిపల్లెకు చెందిన పర్వీన్ బీ(44) తన కుమార్తె రషీదాబీని వెంగంవారిపల్లె పంచాయతీ సింగంవారిపల్లెకు చెందిన షబ్బీర్‌కు ఇచ్చి వివాహం జరిపించింది. అతడు ఇటీవల భార్య, పిల్లలను నిర్లక్ష్యం చేస్తూ కేరళకు వెళ్లిపోయాడు. అక్కడే మరో మహిళతో సహజీవనం చేస్తూ మంగళవారం స్వగ్రామానికి వచ్చాడు. దీంతో అత్త పర్వీన్‌బీ సింగంవారిపల్లెకు చేరుకుని, తన కుమార్తెకు ఎందుకు అన్యాయం చేస్తున్నావంటూ నిలదీసింది. ఆవేశానికి లోనైన షబ్బీర్ అత్తపై దాడిచేసి గాయపరిచాడు. అనంతరం మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చికిత్సలు పొంది దాడి ఘటనపై ఫిర్యాదుచేసింది.

### నాటు సారా తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్


అరెస్ట్ చూపుతున్న ఎక్సైజ్ పోలీసులు

మదనపల్లె : నాటుసారా తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు సీఐ భీమలింగ తెలిపారు. విలేకరులతో బుధవారం ఆయన మాట్లాడుతూ మదనపల్లె మండలం నారమాకులతండా క్రాస్ వద్ద పి.రామానాయక్ కుమారుడు పి.నరసింహులునాయక్(61) సారా తరలిస్తున్నారు. తనిఖీలు నిర్వహించిన పోలీసులు అతడి వద్ద 30 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని అరెస్టు చేశారన్నారు. నిందితుడిపై కేసు నమోదుచేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. తనిఖీల్లో ఎక్సైజ్ ఎస్ఐ దార్కస్, జబీవుల్లా, హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసులు, మహమ్మద్ అలీ, కానిస్టేబుళ్లు నాగరాజు, మధు, వెంకటేష్‌లు పాల్గొన్నారు.

### త్రుటిలో తప్పిన ప్రమాదం


కల్వర్టును ఢీకొన్న కారు

గాలివీడు : మండల కేంద్రం సమీపంలోని చిన్నయేరు వద్ద రాయచోటి-కదిరి ప్రధాన రహదారిలో ఓ కారు చెట్టుకు ఢీకొనడంతో ప్రమాదం చోటుచేసుకుంది. తిరుపతికి చెందిన సాగర్ తన స్నేహితులతో నూతన సంవత్సరం సందర్భంగా పుట్టపర్తికి వెళ్లి.. అక్కడి నుంచి స్వగ్రామానికి తిరుగు ప్రయాణమయ్యారు. మార్గమధ్యంలో కారులో సెల్‌ఫోన్‌కు ఛార్జింగ్ పెట్టుకునే తరుణంలో అదుపు తప్పి రోడ్డు ప్రక్కనున్న కల్వర్టును ఢీకొన్నారు. అశోక్ చేయికి స్వల్పగాయం కావడంతో ఆస్పత్రికి తలించారు. త్రుటిలో పెనుప్రమాదం తప్పడంతో అతడి స్నేహితులు ఊపిరి పీల్చుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### అంతర్జాతీయ త్రోబాల్‌కు మదనపల్లె విద్యార్థి ఎంపిక



త్రోబాల్ క్రీడలో కప్ అందుకున్న పురుషోత్తం

మదనపల్లె : శ్రీలంకలో జరగనున్న త్రోబాల్ టెస్ట్ సిరీస్‌కు ఇండియా జట్టు తరఫున ఆడేందుకు మదనపల్లె జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల విద్యార్థి పురుషోత్తం ఎంపికయ్యాడు. డిసెంబర్ 29న తమిళనాడు హోసూర్‌లో ఇండియా, శ్రీలంక దేశాల జట్ల మధ్య జరిగిన అంతర్జాతీయ త్రోబాల్ టెస్ట్ సిరీస్‌లో ఇండియా జట్టు 6-4 పాయింట్లతో రన్నరప్‌గా నిలిచింది. జట్టులో ఏడుగురు ప్రధాన క్రీడాకారులుంటే, అందులో మదనపల్లెకు చెందిన పురుషోత్తం ఫైనల్ మ్యాచ్‌లో 24 పాయింట్లు సాధించి ప్రతిభ కనబరిచాడు. దీంతో వచ్చే మార్చిలో శ్రీలంకలో జరిగే టెస్ట్ సిరీస్‌కు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా పురుషోత్తంను జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ డాక్టర్.రాటకొండ గురుప్రసాద్, ప్రిన్సిపల్ రమాదేవి అభినందనలు తెలిపారు. అంతర్జాతీయ క్రీడలో కోచింగ్ కోసం రూ.20 వేలు ఆర్థిక సహాయం అందజేశారు.

# గండి క్షేత్రానికి పోటెత్తిన భక్తజనం


గండిక్షేత్రంలో వీరాంజనేయస్వామిని దర్శించుకుంటున్న భక్తులు


స్వామిని దర్శించుకునేందుకు క్యూలో నిలబడిన భక్తులు

వేంపల్లె : నూతన సంవత్సరం తొలి రోజున గండి క్షేత్రంలో ఆంజనేయుడి దర్శనానికి భక్తులు పోటెత్తారు. వందలాది మంది తరలి రావడంతో ఆవరణంతా కిటకిటలాడింది. చక్రాయపేట మండలంలోని గండి క్షేత్రంలో నూతన సంవత్సరం కావడంతో ఈవో వెంకట సుబ్బయ్య ఆధ్వర్యంలో అర్చకులు కేసరి, రాజా బుధవారం తెల్లవారుజామున 4.30 గంటలకే స్వామికి పూజలు, అభిషేకాలు జరిపి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. పెద్ద ఎత్తున తరలివచ్చే భక్తులకు ఇబ్బంది తలెత్తకుండా ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. భక్తులు నదిలో స్నానాలు ఆచరించి స్వామి దర్శనం చేసుకున్నారు. హెల్త్ డిపార్ట్‌మెంట్ ఉచిత వైద్య శిబిరం, పోలీసు శాఖ గట్టి బందోబస్తు ఏర్పాటు చేశాయి. సేవా టికెట్లు కౌంటర్‌లో విక్రయించేందుకు ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు సిబ్బంది విధులు నిర్వహించారు. లింగాల మండలం మురారి చింతల కళాకారులు 30 మంది భజన కార్యక్రమాలు నిర్వహించారు. ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ ట్రిపుల్ ఐటీ ఎన్ఎస్ఎస్ విద్యా వాలంటీర్లు క్యూలైన్లను పర్యవేక్షించారు. వీరపునాయుని పల్లె మండలం పాయసంపల్లె గ్రామానికి చెందిన సురేష్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో 50 మంది ఉచిత ప్రసాదం, అన్నదాన సేవలు అందించారు. ఈ సందర్భంగా సేవా టికెట్లు, లడ్డూ ప్రసాదం, పులిహోర ప్రసాదం, తలనీలాలు, అన్న ప్రసాదం, హుండీల ద్వారా రూ.5,81,172ల ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ తెలిపారు.

### సచివాలయ ఉద్యోగినిపై కేసు నమోదు

జమ్మలమడుగు రూరల్ : పట్టణంలోని 19, 20 సచివాలయ వార్డు మహిళా పోలీస్ భారతి బాయిపై క్రిమినల్ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బి.రామక్రిష్ణ తెలిపారు. పట్టణంలోని 19, 20 వార్డులో పింఛన్ ఇచ్చేందుకు లబ్ధిదారుల నుంచి అక్రమ వసూళ్లకు పాల్పడినట్లు ఆమెపై ఫిర్యాదులు రావడంతో నగర పంచాయతీ కమిషనర్ కె.వెంకటరామిరెడ్డి మంగళవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు. దీంతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆమెపై ఉన్నతాధికారులు సస్పెన్షన్ వేటు వేశారు.

### గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం


పెన్నానదిలో నీటిలో తేలియాడుతున్న వంశీ మృతదేహం

జమ్మలమడుగు రూరల్ : ముద్దనూరు రహదారికి సమీపంలో పెన్నా నదిలో ఈతకు వెళ్లిన కూరపాటి వంశీ(22) గల్లంతయ్యాడు. మంగళవారం రాత్రి 8 గంటల వరకు గజ ఈతగాళ్లతో గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. బుధవారం ఉదయం మళ్లీ తెప్ప సాయంతో గాలించగా మధ్యాహ్నం మూడు గంటలకు యువకుడి మృతదేహం లభ్యమైంది. పోలీసులు ప్రభుత్వ ఆసుపత్రిలో పంచనామా జరిపించి కుటుంబీకులకు అప్పగించారు. మృతదేహన్ని చూసి తల్లిదండ్రులు బోరున విలపించారు. తండ్రి పుష్పరాజ్ ఫిర్యాదు మేరకు కేసు విచారిస్తున్నట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

# రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


మృతి చెందిన కె.శివనారాయణ

కొండాపురం : మండలంలోని తాడిపత్రి- కడప జాతీయ రహదారి దాటుతుండగా ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో కుమ్మెత శివనారాయణరెడ్డి(60) మృతి చెందినట్లు కొండాపురం ఎస్ఐ విద్యా సాగర్ తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు.. మండలంలోని రేగడిపల్లె గ్రామానికి చెందిన కుమ్మెత శివనారాయణరెడ్డి గండ్లూరులో నివాసముంటూ జాతీయ రహదారి పక్కన మెకానికల్ షెడ్ నిర్వహిస్తున్నాడు. మంగళవారం రాత్రి పనులు ముగించుకొని రోడ్డు దాటుతుండగా ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రుడిని 108 వాహనంలో తాడిపత్రి ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

# చికిత్స పొందుతూ యువకుడు...


ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించిన జగన్

జమ్మలమడుగు రూరల్ : మండలంలోని చిటిమిటిచింతల సమీపాన మంగళవారం రాత్రి జరిగిన ప్రమాదంలో ఇద్దరు యువకులు చనిపోయారు. పోలీసుల వివరాల మేరకు.. చిటిమిటిచింతల దర్గా సమీపంలో మలుపువద్ద జరిగిన ప్రమాదంలో ఇద్దరు చనిపోగా.. మరో యువకుడు జగన్‌ను మెరుగైన వైద్యం కోసం ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారు జామున మృతి చెందినట్లు ఎస్ఐ రామక్రిష్ణ తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని విచారిస్తున్నట్లు ఆయన తెలిపారు.

### వ్యక్తి దుర్మరణం


మృతి చెందిన నరేంద్ర

పెండ్లిమర్రి : కడప-పులివెందుల ప్రధాన రహదారిలోని పగడాలపల్లె క్రాస్ వద్ద బుధవారం రాత్రి ద్విచక్ర వాహనం అదుపు తప్పి పక్కనే ఉన్న క్యాపర్‌ను ఢీకొన్న సంఘటనలో వ్యక్తి మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు... నందిమండలం గ్రామానికి చెందిన ఎన్.నరేంద్ర(35) వ్యక్తిగత పనుల నిమిత్తం ద్విచక్ర వాహనంలో కడపకు వెళ్తున్నారు. పగడాలపల్లె క్రాస్ రోడ్డు వద్ద ద్విచక్ర వాహనం అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న క్యాపర్ వాహనాన్ని ఢీకొంది. తీవ్ర గాయాలవడంతో నరేంద్ర అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య ఉంది.